# గుడ్డిపిల్ల

తాడేపల్లిగూడెం స్టేషనులో ఎక్కింది, ఆ బాలిక, బెజవాడబండి. కూడా ఒక చిన్నపిల్లవాడు ఆ బాలిక చేయిపట్టుకొని దారిచూపుతూ వున్నాడు. చినిగిపోయినగుడ్డల్లో మేఘాల్లో చంద్రుడిలా వుంది ఆమె. ఆమెఅందం ఆమెకే తెలీదు.

"వినవే పల్లవా మృదూ చరణా కరుణా వితరాణా గుణాభరాణా" అని పల్లవి ప్రారంభించింది. ఒక్కసారిగా పెట్టె నిశ్శబ్దం ఆవరించింది. విరిసిన వసంతోదయంలో మల్లికా పుష్పసుగంధంలా ఆ కిన్నెరస్వరం, మహావేగంతో పరుగెత్తుతున్న రైలుహోరు శృతికాగా, ఆ పెట్టెఅంతా ప్రవహించింది.

"జనవిభు డానా తిచ్చిన దంటాకాటవికి" అందరి హృదయాలూ కదలిపోయినవి. కొండచిలువ పెనవేసుకొన్న జింకల్లా, చైతన్యరహితులై వింటున్నారు యావన్మందిన్నీ.

"మునివేషధారినై చదివేదననావీని" ఎవరి భావగాంభీర్యం ఎంతవుందో ఆలోతు! వినీలమై వినిర్మలమై కాంతి దాల్చింది.

ఆమె తలముడి కంగారుగా విడిపోయి, నీరులేనిమేఘంలా చెదిరి వుంది. కళ్లు చూస్తూవున్నట్లే వున్నవి. కాని సంజ్ఞానరహితాలై ఎండిపోయిన చెరువుల్లా మెరుస్తున్నవి. తీర్చిదిద్దిన కనుబొమ్మలు, సమమైనముక్కు, చిన్ననోరు, వణికే పెదవులు ఆమెమొహాన సుందరశ్రీ సాక్షాత్కరింపజేస్తున్నవి

ఆమెపాట ఒక సెలయేరులా మర్మరించింది. రాళ్ళ గుట్టలో జలజలలాడింది. సుడిగుండాలు చుట్టింది. చెట్లనీడ సమతలంలో పోయింది, ఆగింది, ఒకబండరాయికింద మాయమై అవతల తిరిగి ప్రత్యక్షమైంది.

ఆ గానం శ్రావణమాసపు పచ్చికలా అల్లుకుపోయింది. శరదృతుపుష్పాలై వికసించింది. నవవసంతమల్లే ఆనంద పర్వమైపోయింది.

## 2

అప్పుడే ఒక స్టేషనులో ఎక్కాడొక బ్రాహ్మణోత్తముడు. వచ్చీరాగానే ఆ పాటకు అడ్డంవస్తూ ఒక హాస్యవచనం అన్నాడు ఆత్మానందం మానవాతీతం కాబట్టి లోతునీళ్ళల్లో మునిగినవాళ్లలా, మనుష్యులు ఆ ఆనందం అట్టేసేపు భరించలేరు. ఈ హాస్యవచనం ఒక్కసారిగా ఆ పెట్టెలో వున్న మానవలోకానికి నిట్టూర్పు యిచ్చింది. తెప్పరిల్లజేసింది. ఆ బాలిక పాట మానివేసింది.

కొత్తగా వచ్చిన హాస్యగాడు జబ్బుహాస్యంతో ప్రారంభించాడు. తనకు తగని జబ్బన్నాడు. అది తిండిజబ్బు. భోజనానికి వెడితే మొగపెళ్ళివారికి చేసిన శాకపాకాలన్నీ తన విస్తట్లోనే మాయమాత్రో వుండేవిట. వైద్యుడిది మహారోగం అన్నాట్ట. దానికి ఉపయాన్నే మినపసున్ని తాటికాయలంత మాత్రలుచేసి ఒక శేరు తేనెపాకం అనుపానంగా, ఒక డజను సేవించమన్నాట్ట. ఇత్యాది హాస్యంతో, కోమటిహాస్యం, భావహాస్యం, గొల్లహాస్యం, బుడబుక్కలహాస్యం, కునక్కనూతలు,

కక్కుకూతలు కుప్పేశాడు. ఆ రైలుపెట్టెలో మనుష్యులు విరగబడి నవ్వారు. కళ్ళవెంబడి అందరికీ నీళ్ళు కారినైడొక్కలు నొక్కుకున్నారు. ఒకళ్ళమీద ఒకళ్ళు పడ్డారు. ఎంత హాస్యాని కన్నా చిరునవ్వులు మాత్రం వెదజల్లుతుంది హిందూస్త్రీజనం. అక్కడి ఆడవాళ్ళు ఒళ్ళుమరచి నవ్వుపొంగుల్లో ఊగిపోయారు. అక్కడనుండి డబ్బు వసూలుచేయడం ప్రారంభించాడు. కొన్ని అణాకాసులు, అర్థణాలు, రెండణాలకాసులు గళగళ అతని హస్తంలోకి ప్రవహిస్తూ అక్కడే మాయమయ్యాయి. అత గాడు కొంచెం గుంటుపల్లి భాస్కరుడి ఇంద్రజాలం కూడా ఎరుగున్నవాడిలా కనబడ్డాడు. ఒక పన్నెండణాలుదాకా పోగుబడింది కాబోలు, అదంతా "హూంఫత్తని" తెల్లపోయి చూస్తూవున్న ఒక కుఱ్ఱవాడిలాగు లోంచి గలగలరాలించాడు చిల్లరంతానూ. "అమ్మదొంగా" అన్నాడు. పెట్టెఅంతా ఘొల్లుమని నవ్వింది.

"మీరు చల్లగావుండాలి, నేను పచ్చగావుండాలి. మీ ధాన్యాలు నా గాది నిండాలి. మీ నవ్వులోంచి ధనవర్షం కురియాలి. జయీ! విజయీ భవ!! దిగ్విజయీ భవ!!! మీ రెప్పుడూ రైలుప్రయాణం చేస్తూవుండాలి. బాబూ! సెలవండి" అని తర్వాత స్టేషనులో దిగిపోయాడు. వేరేపెట్టె ఎక్కినాడు కాబోలు.

## 3

ఇంతసేపు ఆ గుడ్డిపిల్ల నిర్ఘాంతపోయి నిల్చున్నది. అప్పు డప్పుడు వేళాకోళంమాటలకి చిరునవ్వునవ్వుతూంది. కూడావున్న

ఆ పిల్లవాడు పకాలుననవ్వుతూవున్నాడు. హాస్యంపొడుగునా.

ఆ బాలిక, గొంతుకు సవరించుకుంది.

ఎంతసే వేడినా, ఎక్కడవుందువో

కంతు జనకరామా!!"

అని హాయిమనే కృతి ఒక్కటి ఆలాపనచేసింది.

ఆ హాస్యగాడిమాటలే పక్కఆయనకి జ్ఞాపకంచేస్తూ విరగబడి నవ్వుకుంటూవున్న ఒక ముసలి కమ్మాయన "వుస్ పిల్లా! వుండు" అన్నాడు.

ఆ బాలిక అల్లాగే నిల్చుండిపోయింది. ఆ పసిపాప డబ్బు అడుక్కోబోగా 'ఛీ, పో. ముట్టుకుంటావు; చిల్లర అయిపోయిందిరా!' అని వరసగా అంటూనే వున్నారు.

ఆ బాలిక అల్లాగే చైతన్యరహితంగా నిల్చునేవుంది. రయిలు కదిలి పోతూనేవుంది.

ఆరుకాన్లు వసూలయ్యాయి. ఆ అంధబాలిక జ్ఞానశూన్యాలైన కళ్ళల్లో వేడినీళ్ళు తిరుగుతునేఉన్నవి. ఆమె నిర్మలహృదయం మాటలేని ఏడుపులో సుడితిరిగింది. పిల్లవాడు వచ్చి ఆ అణాన్నర ఆ బాలిక చేతుల్లో పెట్టాడు. ఆమె మొహం వంక తేరిపారచూశాడు. ఆమెచెయ్యి పట్టుకొన్నాడు. వాడి లేతమనస్సు చివుక్కుమంది. వాళ్ళిద్దరకూ ఒకళ్ళహృదయం ఒకళ్ళకి విస్పష్టమే. ఇద్దరూ ఒక తలువుపూల యిరికి కూల బడ్డారు. ఒదిగిపోయారు. చూపులేని ఆ బాలికకళ్ళు, చూపు పుట్టని ఆ పిల్లవాడిహృదయం ఒకటికొకటి ఆలింగనం చేసుకొన్నవి. ఆ బాలకుడు కంటినీరు ఆ బాలిక చేతులు అద్దుకుని ఆపుకోపొయాడు.

# 4

ఆ బాలిక పాట ప్రారంభించకపూర్వమే ఒకవ్యక్తి ఆ రైలుపెట్టె ఎక్కాడు. అతడూ రైలు బిచ్చగాడే—ఒక చెయ్యిలేదు.

ముప్పైయేళ్లుంటాయి. చింకిగుడ్డా, చిరిగిపోయిన చొక్కాతో ఒక పిల్లంగ్రోవి ఎడంచేత్తో పట్టుకుని రైలు ఎక్కాడు. అప్పుడే ఆ బాలిక తన దివ్యగానం ఆలాపనచేసింది. తర్వాత జరిగిన కథఅంతా చూస్తూనేవున్నారు.

ప్రపంచంఅంటే కోపంగలమనిషి. వెనక రైల్వేపోర్టరుగా వుండి రైలుక్రింద పడిపోయి చేయి పోగొట్టుకున్నాడా బిచ్చగాడు. నా అనేవారు లేకుండావుండేవాడు. జీతంలోవచ్చిన నాలుగురాళ్లుమిగుల్చుకుంటూ, గూడ్సుస్టేషనులోఅప్పుడప్పుడు దొంగతనంచేసిన వస్తువులు అమ్మగావచ్చిన డబ్బూ, రైలులోంచి దిగిన ప్రయాణీకులసామాను మోయడంవల్ల వచ్చిన కూలి, టిక్కెట్టులేనివాళ్ళను ఇంజనుదగ్గరనుంచో, గార్డుపెట్టె దగ్గరనుంచో పోనిచ్చినందుకు "లంచంమామూళ్లు" అంతాకలిపి నూరురూపాయలు మూటకట్టాడు. ఇంతట్లో చెయ్యిపోయినందుకు, రాజమండ్రి రైల్వేఆస్పత్రిలో మూడునెలలు వున్నాడు. అప్పుడు తాను ఇంటిలో దాచుకున్నడబ్బు ఎవ్వరో మటుమాయంచేశారు. ఉద్యోగం పోయింది. పెండ్లిలేదు. దాంతో అతనికి మతిపోయింది. దిక్కులేనివాడికి దేవుడుకాదు, తిరిపెమే దిక్కు. బిచ్చగాళ్ళకు కొందరు గురువులు వుంటారు. అతడు ఓ గురువుదగ్గర పిల్లంగ్రోవి బాగావూదడం, అందు

మీాద వేదాంతంపాటలు, భక్తిపాటలు పాడడం నేర్చుకున్నాడు; రైలుబిచ్చం సాగించాడు.

రైలేగా ద్రోహంచేసింది! ఆ వచ్చినడబ్బుతో కాఫీహోటల్లో తినడం, కల్లుపాకదగ్గర గాళ్ళపుల్లమ్మకూతురు పోసే ధవళసుధారసం గళగ్రాహింగా సేవించి, సింధూరా నిమిషత్వం, మహాయోగంలో మైకం సంపాదించి అమరుడౌతుంటాడు.

అలాంటివాడు ఆగుడ్డిపిల్లపాట విన్నాడు. అతని మొఱటు మనస్సు గాలిలో వూగిపోయింది. దోహదంచేసిన మొండిచెట్టు వికసించినట్లు చిగురు దాల్చింది. ఏ ఆవేశమో అతనికి తెలియదు. అతనికి కళ్ళు నీళ్ళుతిరిగినై.

మనుష్యులచంచలత్వమూ, కఠినత్వముచూస్తే అతనికి అసహ్యంవేసింది. ఎవ్వరూ తియ్యకుండా, ఆ గుడ్డిపిల్లను నిరసించగానే, ఆతడు ముట్టెవంచిన కారుదున్న అయిపోయినాడు. తాను పొద్దుట్నుంచీ పోగుచేసుకున్న అరణాలడబ్బులూ ఆ అమ్మాయిచేతిలో వేసి, రైలు ఆగగానే దిగి చక్కాపోయాడు. ఆ అమ్మాయికి ఇంతడబ్బు ఎవరిచ్చారో తెలవలేదు. "దేవుళ్ళలాంటి దయగల ప్రభువు ఎవరిచ్చారో!" అనుకున్నది.

## 5

ఆ గుడ్డిపిల్లకు జ్ఞానంవచ్చినప్పటినుంచీ ఇల్లా ముష్టిఎత్తుకుంటూ రైలుపక్కగ్రామంలో ఒక బహు కుటుంబీకుడు, మంచి అంతఃకరణగల ఒకరైతుఇంటిలో ఒక పంచను వుంటూ వుండేది. ఊళ్లో ఒక పెద్దసంసారి తనపిల్లకు సంగీతంనేర్పిస్తూ

వుండేవి ఓ వీధివాకిట్లో కూర్చుని సంగీతం చెవులారవినేది. ఇల్లా ఏకలవ్యుడులా అద్భుతమైన గానవిద్య సంపాదించుకుంది. ముష్టి బాగా వచ్చేది. ఆ డబ్బు మహాయిల్లాలైన రైతుభార్యకు దాచ యిచ్చేది.

పెద్దదవుతూవున్నకొద్దీ ఏదో భయం, సిగ్గు కలుగుతూ వుండేవి. ముష్టికి తిన్నగా వెళ్ళక ఇదివరకు పోగుచేసుకున్న డబ్బులు ఖర్చుచేసుకుని గంజికాచుకుంటూవుండేది. తల్లిఎవరో తండ్రి ఎవరో, ఎల్లా ఆరైతుఇంట్లో చేరిందో ఆ పిల్లకు ఏమీ తెలియదు.

ఒకరోజున చేబోలు ముష్టికిపోయి మధ్యాహ్నం కాల్వగట్టున వంటచేసుకుంటూవుండగా, ఒక పసిపిల్లవాడు మూడేళ్ళవాడు ఆ అమ్మాయి దగ్గిరకు వచ్చాడు. ఎక్కడ్నుంచి వచ్చాడో! ఆ గుడ్డిపిల్ల అతన్ని వళ్ళోకి తీసుకొంది. అప్పట్నించి వాళ్ళిద్దరూ, ఒక తల్లీబిడ్డల్లా అయ్యారు. అతడు దారిచూపించడం, ఆమె పాటపాడడం—అల్లా నాలుగేళ్ళు గడిచినై.

## 6

ఆరోజు సాయంత్రం కాల్వగట్టున వంటచేసుకుంటూ వుంది. పిల్లవాడు చితుకులు ఏరితెచ్చి యిస్తున్నాడు. ఆ సమయంలో ఆ సంధ్యారుణకాంతుల్లో ఒక పురుషుడు ఆ చెట్టు క్రిందికి వచ్చాడు. అతనిముఖం చిరునవ్వులు నవ్వుతూవుంది. కళ్ళులేని ఆ కబోది చెవులు, శరీరం యావత్తూ అతిసున్నితమైన గ్రహణశక్తి సంపాదించుకున్నవి. ఆ కొత్తమనిషి రాక కనిపెట్టింది.

"ఒరే ఎవర్రా ఆ వచ్చింది?"

ఆ పిల్లవాడు ఆ మనిషిదగ్గిరకు పరుగెత్తుకుని వెళ్లాడు. కుంటిచెయ్యిచూశాడు, పిల్లంగ్రోవి చూశాడు.

"ఆరోజుమనిషి"

ఆ పిల్ల గ్రహించింది. ఆమె తెలతెలపోయింది. గుండె కొట్టుకుంది. తల వాల్చుకుని వంటచేస్తూనేవుంది.

ఆ మనిషి పిల్లంగ్రోవి తీశాడు.

"ఏదిర లక్ష్మణ సీత,

పర్ణశాలాలో లేదెందుశాత—"

అని పాటపాడినాడు. ఆ తేనెచుక్కలధ్వని ఆ సంధ్య అంతా ఆక్రమించుకుంది. ఆ పిల్లవాడు ఆతనిదగ్గరగాజేరి మొహంచూస్తూ కూచున్నాడు. ఆ అమ్మాయి వంటచేస్తూనే వుంది.

"రారోరి చిన్నవాడా, మావాడా

రారోరి చిన్నవాడా—"

చీకట్లు పూర్తిగా అలుముకువస్తూవున్నవి. నక్షత్రాలు మినుకుమినుకుమంటూ ఆకాశాన్ని అలంకరించాయి.

"ఎందుకైనా (వుంచినావో బందిఖానాలో

రామయ్యతండ్రీ..."

ఆ బాలికవంట పూర్తిఅయింది. నిప్పులు ఆర్పేసింది. బిచ్చగాడు ఆమెదగ్గరగాపోయి కూచున్నాడు.

ఎడంచేయి మొండిది. అది పిల్లంగ్రోవికి నొక్కుకొని కుడిచేతి వేళ్ళతో వూదుతాడు.

"నీకూ నీవారు లేరు, నాకూ నావారు లేరు

వీటిబిడ్డునా ఇల్లుకడదాం పదరా!"

ఆ పాట అమృతమయంగా ఆ చీకట్లో వ్యాపించింది. గాళ్ళూసిల్లు నిర్మలంగా ప్రవహించిన్నై.

"నాకు పెళ్ళిలేదు; నేనూ ముష్టివాడినే. మనం ఇద్దరం ఎందుకు పెళ్ళిచేసికోకూడదు?"

ఆ అమ్మాయి ఆలోచించుకుంటూవుంది. వేయిఆలోచనలుపోయాయి. ఒళ్ళు ఒణికింది. అప్రయత్నంగా అతనిదగ్గిరకు జరిగింది. మొహం తడిమింది, దేహం తడిమింది. ఆ మనుష్యుడికి వళ్ళు జలదరించింది. ఆ చింపిగుడ్డఅమ్మాయి అప్సరసలా తోచింది. తనజీవితం జ్ఞాపకంవచ్చింది. ఒక గుడిలో మోకారించిన భక్తుడయ్యాడు. ఆ బాలికను గట్టిగా తన గుండె కదుముకుందామనుకున్నాడు. చూపులేని ఆ కళ్ళుచూసి కళ్ళనీళ్లు నింపుకున్నాడు. ఆ బాలిక అతనితల నిమిరింది. కళ్ళు తుడిచింది. అతని గుణగణాలు ఎలా అర్థమయ్యాయో!!

"ఆ పిల్లవాడు నాకు తమ్ముడు. చిన్నతినాణ్ణుంచి పెంచుకున్నా"

నాకూ తమ్ముడే; నా బిడ్డడే అవుతాడు. ఇక్కణ్ణుంచి నేనూ పెంచుకుంటా."

ఆ నక్షత్రాలే సాక్షిగా, పక్కన ప్రవహించేగోదావరి నీరు సాక్షిగా, వాళ్ళిద్దరూ ఆ శుభముహూర్తంలో భార్యాభర్తలయ్యారు. ఒకళ్ళ కౌగిలింతలో ఒకళ్ళు కలసి మెలిసి కరిగిపోయారు.

ఆ పసిపిల్లవాడు హృదయంతో 'తథాస్తు' అని నవ్వుకున్నాడు.